# బహిరంగ విసర్జనకు అడ్డుకట్ట వేద్దాం!

## నగరం సహా ఎలమంచిలి, నర్సీపట్నం లక్ష్యం ❑ అక్టోబరు 2 నాటికి పూర్తి చేయాలని కలెక్టరు ఆదేశం

వన్‌టౌన్, న్యూస్‌టుడే: విశాఖ నగరం సహా ఎలమంచిలి, నర్సీపట్నం ప్రాంతాలను బహిరంగ మల, మూత్ర విసర్జన రహితంగా తీర్చిదిద్దాలని కలెక్టరు ప్రవీణ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. గాంధీ జయంతి రోజైన అక్టోబరు 2 నాటికి ఈ లక్ష్యాన్ని చేరుకోవాలని, దీని కోసం ప్రజలను చైతన్యపర్చడంతో పాటు మరుగుదొడ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. శనివారం కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో పలు సమీక్షలను నిర్వహించారు. తొలుత బహిరంగ మల విసర్జన రహిత అంశాలపై సమీక్షించారు. ఎలమంచిలి పురపాలక సంఘం ఛైర్‌పర్సన్, కమిషనర్ల కృషి ఫలితంగా 95 శాతం మేర బహిరంగ విసర్జన ప్రాంతాలుగా తీర్చిదిద్దారని, మిగతా లక్ష్యాన్ని పూర్తి చేయాలని సూచించారు. నగరంలో ఇంతవరకూ 44 వార్డులను ఈ దిశగా తీర్చిదిద్దారని, మిగతా ప్రాంతాల్లోనూ సత్వరమే పనులు పూర్తి చేయాలన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి స్థలాలు లేకుంటే ఇంటికి 500 మీటర్ల దూరంలో సామాజిక మరుగుదొడ్లు నిర్మించి నీరు, విద్యుత్తు సౌకర్యం కల్పించాలన్నారు. కప్పరాడ వంటి కొండవాలు ప్రాంతాల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రత్యామ్నాయం చూడాలని ఆదేశించారు. భీమిలి, అనకాపల్లి ప్రాంతాల్లో శతశాతం మరుగుదొడ్ల నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. మార్కెట్ల వద్ద ప్రత్యేక సిబ్బందిని నియమించి బహిరంగ విసర్జన జరగకుండా చూడాలని ఆదేశించారు. సమీక్షలో పురపాలక శాఖ ప్రాంతీయ కమిషనర్ ఆశాలత, జీవీఎంసీ అదనపు కమిషనర్ మూర్తి, సీసీ వెంకటరత్నం, సీఈ చంద్రయ్య, మెప్మా డైరెక్టర్ మిల్టన్ తదితరులు పాల్గొన్నారు.



జీవీఎంసీ, యలమంచిలి, నర్సీపట్నం పురపాలక శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

**'మన గ్రామం-మన విశాఖ'ను విజయవంతం చేయాలి:** 'మన గ్రామం - మన విశాఖ' కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తోందని, అధికారులు మరింతగా శ్రమించి విజయవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ప్రతీ గురువారం గ్రామాలను సందర్శిస్తూ అక్కడ నెలకొన్న సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు చర్యలను తీసుకోవాలన్నారు. అక్టోబరు 2 నాటికి 70 గ్రామాలను బహిరంగ విసర్జన రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు.

**'ఈ-పాలన' మొదలవ్వాలి:** ఈ- కార్యాలయాల అమలుపై కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ సమీక్షించారు. ప్రతీ కార్యాలయం ఈ-పాలన పరిధిలోకి రావాలని, ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ ఈ-ఆఫీసుల ద్వారానే జరగాలని కలెక్టర్ ఆదేశించారు. ఇంతవరకు 13 కార్యాలయాలు మాత్రమే దీని పరిధిలోకి వచ్చాయన్నారు.